



# మనం

చిత్తూరు | తిరుపతి

మంగళవారం 31 మార్చి 2026

4 పేజీలు





# సామూహిక గృహ ప్రవేశాలు కార్యక్రమం

- పాల్గొన్న గౌ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు






నాయుడుపేట, మార్చి, 30 : నాయుడుపేట మండలం పుదూరు గ్రామంలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామూహిక గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, గృహనిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, సూళ్లూరుపేట శాసనసభ్యులు నెలవల విజయశ్రీ, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బి.తాతయ్య బాబు, APTIDCO, చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హౌసింగ్ మరియు సమాచార శాఖ మంత్రి మాట్లాడుతూ..* ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా ఒక చారిత్రాత్మక కార్యక్రమంగా, ముఖ్యమంత్రి చేతుల మీదుగా సుమారు రెండున్నర లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయన్నారు. మూడు నెలల క్రితం విజయవంతంగా నిర్వహించిన మూడు లక్షల గృహప్రవేశాల తర్వాత, మరోసారి పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం చేపట్టడం ప్రభుత్వం సంకల్ప బలం, ప్రజల పట్ల నిబద్ధతకు నిదర్శనమన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక సవాళ్లను ప్రజలకు తెలియజేశారు. 2019–24 మధ్య కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఆలస్యంగా చెల్లించడం, కాంట్రాక్టర్లకు బకాయిలు పేరుకుపోవడం, విద్యా సంస్థలు మరియు ఆసుపత్రులకు చెల్లింపులు నిలిచిపోవడం వంటి సమస్యలు తీవ్రంగా కనిపించాయన్నారు. ప్రజలు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి మరియు పునర్నిర్మాణం కోసం విశ్వాసంతో ప్రస్తుత నాయకత్వానికి చారిత్రాత్మకమైన మద్దతు ఇచ్చారన్నారు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని క్రమబద్ధీకరించడంతో పాటు, సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతుల్యత సాధిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఈ గృహప్రవేశాల కార్యక్రమం, ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడంలో కీలక అడుగుగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతూ, రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తున్నామని తెలిపారు.

**★రాష్ట్ర పురపాలక మరియు పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు మాట్లాడుతూ..★**

టిడ్కో గృహ నిర్మాణాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా 2014–19 కాలంలో ప్రారంభమైన గృహ నిర్మాణ ప్రాజెక్టుల నేపథ్యాన్ని, అమలు విధానాన్ని మరియు తరువాత ఏర్పడిన పరిస్థితులను వివరించారు. ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో పేదలకు నాణ్యమైన, దీర్ఘకాలం నిలబడే ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. దేశ విదేశాలలో గృహ నిర్మాణ నమూనాలను అధ్యయనం చేసి, రాష్ట్రంలో సుమారు 7 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చారన్నారు.ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, గృహాల పరిమాణాలను 300, 365, 430 చదరపు అడుగులుగా మూడు రకాలుగా రూపకల్పన చేశారన్నారు. మహిళలు స్వయంగా ముందుకు వచ్చి పెద్ద ఇళ్లు కావాలని కోరుకోవడంతో ఈ మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ గృహాలను ఆధునిక షీర్ వాల్ టెక్నాలజీతో నిర్మించామని, ఇది సాధారణంగా ఎత్తైన భవనాలకు ఉపయోగించే సాంకేతికత అని మంత్రి గారు వివరించారు. ఈ టెక్నాలజీ ద్వారా నిర్మించిన ఇళ్లు దీర్ఘకాలం నిలబడటంతో పాటు భద్రతా ప్రమాణాలు కూడా మెరుగ్గా ఉంటాయని చెప్పారు. గృహాల్లో కల్పించిన సదుపాయాల గురించి మాట్లాడుతూ A-గ్రేడ్ టైల్స్, టేకు చెక్కతో ప్రధాన ద్వారం, హై క్వాలిటీ విండోలు, గ్రానైట్ వంటగది ప్లాట్ ఫామ్, స్టెయిన్లెస్ స్టీల్ సింక్, కబోర్డ్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ (UGD), సెవేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ (STP), తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అదేవిధంగా, ఈ గృహాలను కేవలం ఇళ్లుగా కాకుండా పూర్తి స్థాయి గేటెడ్ కమ్యూనిటీలుగా అభివృద్ధి చేశామని తెలిపారు. పార్కులు, జిమ్ లు, పిల్లల ఆట స్థలాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ సదుపాయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్వాడీలు వంటి సామాజిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. తరువాతి కాలంలో ప్రాజెక్టు పరిమాణం తగ్గించబడటంతో పాటు అనేక ఇళ్లు పూర్తి కాలేదని మంత్రి గారు విమర్శించారు. బ్యాంక్ లోన్ల విషయంలో కూడా సమస్యలు తలెత్తి, లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం బాధ్యత తీసుకొని, బాధితుల తరపున సుమారు ₹140 కోట్లు బ్యాంకులకు చెల్లించి, వారి ఖాతాలను సరిచేసినట్లు వెల్లడించారు. అదనంగా, అడ్వాన్స్ చెల్లించిన 83,865 మంది లబ్ధిదారుల సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.చివరగా, పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, గృహ నిర్మాణ కార్యక్రమాలను సమర్థవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందజేస్తామని మంత్రి గారు హామీ ఇచ్చారు.

తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు మున్సిపాలిటీల్లో పదివేలకు పైగా TIDCO గృహాలను రూ. 735 కోట్ల నిర్మాణం వ్యయంతో చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. నేడు నాయుడుపేట నందు 2,064 TIDCO గృహాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని

5లో

# వేడుకగా వసంతోత్సవాలు ప్రారంభం

- వట్టి వేరు మండపంలో సేదతీరిన శ్రీ వారు, దేవేరులు
- వన్య మృగాల సమూనాలతో శోభిల్లిన వసంతమండపం




తిరుమల, మార్చి 30,మనం న్యూస్:తిరుమలలోని వసంతోత్సవ మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు సోమ వారం వేడుకగా ప్రారంభమయ్యాయి. వసంత ఋతువులో శ్రీ మలయప్ప స్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఎండ వేడి నుండి స్వామివారు ఉపశమనం పొందేందుకు జరిపే ఉత్సవం కావడంతో దీన్ని ''ఉపశమనోత్సవం'' అని కూడా అంటారు. ఈ ఉత్సవంలో సుగంధాన్ని వెదజల్లే పుష్పాలతోపాటు పలురకాల మధురఫలాలను స్వామివారికి నివేదిస్తారు. ఈ వేడుకల కోసం వట్టివేరుతో ఆకర్షణీయంగా మండపాన్ని రూపొందించారు. అలాగే వేలాడే కోతులు, ఏనుగులు, సింహాలు, పులులు, నెమళ్లు, పాముల తదితర జంతువులు, పలురకాల చెట్ల ప్రతిరూపాలతో శేషాచల అడవిని తలపించేలా ఈ మండపాన్ని తీర్చిదిద్దారు.ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వారు నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా వసంత మండపానికి వేంచేపు చేశారు.వైభవంగా స్నపనతిరుమంజనం :వసంతోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు శ్రీ భూ సమేత మలయప్పస్వామివారికి స్నపనతిరుమంజనం శోభాయమానంగా జరిగింది.ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా క్షీర(పాలు), దధి(పెరుగు), మది(తేనె), నారికేళం(కొబ్బరినీళ్లు), హరిద్రోదకం(పసుపు), గంధోదకం(గంధం)తో స్నపనం నిర్వహించారు. శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను వైఖనసాగమోక్తంగా అర్చకులు చేపట్టారు. ఈ సందర్భంగా తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే పాశురాలను వేదపండితులు పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్లు సాయంత్రం అక్కడినుండి బయల్దేరి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఈవో ఎం.ర విచంద్ర, బోర్డు సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి, అద న పు ఈవో సిహెచ్ వెంక య్య చౌద రి,ఆలయ డెప్యూటీ ఈవో లోక నాథం, ఇతర అధికారులు, విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

# మహిళా వ్యాపారాలకు కేంద్ర ప్రభుత్వం వెన్నుదన్ను

- ఏపీలో కుప్పలుతెప్పలుగా ముద్రా రుణాలు
- మహిళా శాస్త్రవేత్తలకు సంబంధించి లోక్ సభలో గళమెత్తిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు
- పిఎంఇజిపి కింద ఐదేళ్లలో రూ.613 కోట్లు విడుదల
- నైపుణ్య శిక్షణలోనూ మహిళలదే హవా
- -పార్లమెంటులో చిత్తూరు ఎంపీకి సమాధానమిచ్చిన కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి



చిత్తూరు, మార్చి30 :రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు సత్ఫలితాలనిస్తున్నాయనీ చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. దీంతో ఎన్డీఏ సర్కార్ మహిళా మణులకు దన్నుగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల స్థాపనలో మహిళలు రికార్డు స్థాయిలో లబ్ధి పొందుతున్నారనీ చెప్పారు .పార్లమెంటు సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., ఆంధ్రప్రదేశ్లో ముద్రా లోన్ల దరఖాస్తులు కుప్పల తెప్పలుగా ఉన్నాయనీ..,మహిళా శాస్త్రవేత్తలకు సంబంధించి పలు ఆసక్తికర అంశాలను సభముందుంచారు.దీనికి సానుకూలంగా స్పందించిన భారత ప్రభుత్వం.., సోమవారం లోక్ సభలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి.., తాను అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలియజేశారు.ఏపీకి సంబంధించిన పలు ఆసక్తికర గణాంకాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడించినట్లు పేర్కొన్నారు. ముద్రా రుణాల్లో ఏపీ టాప్! అని చెప్పిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ..,ప్రధాన మంత్రి ముద్రా యోజన ద్వారా రాష్ట్రంలో వ్యాపార విస్తరణకు భారీగా నిధులు అందుతున్నాయన్నారు. పథకం ప్రారంభం నుంచి ఫిబ్రవరి 2026 వరకు ఏపీలో ఏకంగా 1.16 కోట్ల రుణ ఖాతాలకు అనుమతి లభించిందనీ, జిల్లాల వారీగా పరిశీలిస్తే.. తూర్పుగోదావరి జిల్లా (10.76 లక్షలు), గుంటూరు (9.10 లక్షలు), కృష్ణా (8.79 లక్షలు), విశాఖపట్నం (8.06 లక్షలు) జిల్లాలు ముందంజలో ఉన్నాయని ఆయన తెలిపారు. అలాగే 'స్టాండ్ అప్ ఇండియా' పథకం కింద ఎస్సీ, ఎస్టీ , మహిళా పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంలో ఇప్పటివరకు 15,391 రుణాలు మంజూరయ్యాయనీ,ఐదేళ్లలో రూ. 613 కోట్ల సబ్సిడీ ఉపాధి కల్పన ధ్యేయంగా సాగుతున్న పి.ఎం.ఇ.జి.పి పథకం కింద గత ఐదేళ్లలో ఏపీకి రికార్డు స్థాయిలో మార్జిన్ మనీ సబ్సిడీ అందిందన్నారు.2020-21 నుంచి 2024-25 వరకు: మొత్తం 16,053 సూక్ష్మ పరిశ్రమలకు గాను రూ. 613.68 కోట్ల సబ్సిడీని కేంద్రం

5లో



## చైతన్య స్వచ్ఛంద సేవ సంస్థకు లభించిన విశిష్ట మార్గదర్శి పురస్కారం

మదనపల్లె, మార్చి 30,మనం న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన P4 మార్గదర్శి బంగారు కుటుంబం 10-24 స్వర్ణాంధ్ర @2047 కార్యక్రమం యందు మదనపల్లి నందు గత 17 సంవత్సరాలుగా ఆరోగ్యం ఆశ్రయం కల్పించడమే కాకుండా ఆనంద వృద్ధాశ్రమం ద్వారా ఆశయం కల్పిస్తూ మానసిక ధైర్యం కల్పిస్తున్న చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ యొక్క సేవలను గుర్తించి విశిష్ట మార్గదర్శి పురస్కారాన్ని మదనపల్లి శాసనసభ్యులు ఎమ్మెల్యే షాజహాన్ భాషా అన్నమయ్య జిల్లా మంత్రివర్యులు జనార్ధన రెడ్డి అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి చేతుల మీదుగా విశిష్ట మార్గదర్శి పురస్కారాన్ని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రెటరీ కవిత రాణికి అందజేశారు ఈ సందర్భంగా కవితా రాణి మాట్లాడుతూ విధాత లాంటి దాతల సహకారంతో నేడు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు విశిష్ట మార్గదర్శి పురస్కారం అందింది ఈ సందర్భంగా విధాత లాంటి దాతలు అందరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.



## శాంతిపురం మండలంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరీ సమావేశం

శాంతిపురం మండలం మార్చి 30 మనం న్యూస్: శాంతిపురం మండల సచివాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరీ సమావేశాన్ని తాసిల్దారు ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో సమస్యలపై తాసిల్దార్ ప్రకాష్ బాబుకు దళిత నాయకులు వివరించారు సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిని పట్టించుకునే వారు లేరన్నారు.ఎన్ఆర్ఈజీఎస్ వెలుగులో తీవ్రమైన అవినీతి ఆరోపణలు జరుగుతున్నాయి అని తనిఖీ చేసి వాటిపై చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ప్రకాష్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరన్న,ఎస్ఐ ఐ నరేష్ మరియు కందస్వామి,దేవరాజు,రాజు, బాల చంద్రబాబు, వేణు, పలువురు ఎస్సీ ఎస్టీ నాయకులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మదనపల్లె చిన్నారి కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం....

- జిల్లా ఇంచార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.

మదనపల్లె,మార్చి 30: ఇటీవల మదనపల్లిలో చిన్నారి హత్య నేపథ్యంలో.. నేడు చిన్నారి తల్లిదండ్రులకు పరామర్శించిన జిల్లా ఇంచార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి,చిన్నారి తల్లిదండ్రులను ఓదార్చి, ధైర్యం చెప్పి, బాధిత కుటుంబానికి అండగా ఉండేందుకు రూ. 10 లక్షల చెక్ ను అందించిన మంత్రి. మదనపల్లి మండలం నీరుగట్టువారిపల్లిలో ఫిబ్రవరి 17వ తేదీన చోటుచేసుకున్న చిన్నారి హత్య సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. అమాయక బాలిక ప్రాణాలు కోల్పోవడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, రానున్న రోజుల్లో అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం చిన్నారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ భాష,జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ , జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మరియు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



2

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుక



## దీర్ఘకాలిక వ్యాధులకు మాత్రల పంపిణీ చేసిన వైద్య అధికారులు సిబ్బంది

పూతలపట్టు మార్చి 30 మనం న్యూస్: దీర్ఘకాలిక వ్యాధులకు ఇబ్బంది పడుతున్న రోగులకు సోమవారం పూతలపట్టు ప్రాథమిక వైద్యాధికారి వినయ్ కుమార్ మాత్రలు పంపిణీ చేశారుపూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ నాగిరెడ్డిపల్లి లో ఫ్యామిలీ డాక్టర్ పోగ్రామ్ లో పాల్గొని ప్రజలకు వైద్యం వైద్య సలహాలు సూచనలు సేశారు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పాల్గొని నాగిరెడ్డిపల్లి గ్రామం లో ప్రజలకు వైద్య పరీక్షలో రక్త పరీక్షలు చేసి రక్తపోటు మధుమేహం గల దీర్ఘకాలిక జబ్బులకు నెలకు సరిపడ మందులు ఇవ్వడం జరిగిందిని సిహెచ్ఓ లక్ష్మి నారాయణ తెలియజేశారుచిన్న చిన్న వ్యాధులకు ఇక్కడే వైద్య సేవలు ఇచ్చి తగు మందులు కూడా ఇస్తామన్నారు కావున ప్రజలు అందురు ఈ వైద్య శిభిరం ను సద్వినియోగం సేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమం లో ఎం ఎల్ హెచ్ పి సింధు ఆరోగ్య కార్యకర్త చరిత ఆశలు కామిగి శోభ పాల్గొన్నారు

## శ్రీ శక్తి పీఠంలో బ్రహ్మోత్సవ కుంభాభిషేకం,నవగ్రహ మహోత్సవాలు ప్రారంభం.




రామచంద్రపురం: మండలంలోని రాయలచెరువు పక్కనున్న శ్రీ శక్తి పీఠంలో బ్రహ్మోత్సవ కుంభాభిషేకం, నవగ్రహ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం కుర్తాళ శ్రీ సిద్ధేశ్వరీ పీఠాధిపతులు, శ్రీ శక్తి పీఠ వ్యవస్థాపక పరమాచార్యులు జగద్గురువులు శ్రీ శ్రీ శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారి దివ్య ఆశీస్సులతో, మంత్ర మహేశ్వరి, శ్రీ శక్తి పీఠాధీశ్వరి శ్రీ శ్రీ శ్రీ రమ్యానందభారతీ మహాస్వామిని అత్యంత వైభవంగా పూజ,ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ శక్తి పీఠం ఏర్పాటుచేసి ఆరవ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో 30వ తేదీ నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవ కుంభాభిషేకం, నవగ్రహ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ శక్తి పీఠంలో స్వర్ణాకర్షణ భైరవ మంత్ర హోమము, లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. 31శక్తి కాళీ మంత్ర హోమము, అథర్వణ మహా బలి. ఏప్రిల్ 01 ఆకాశ శ్రీ చక్ర మహామేరువుకు మహాకుంభాభిషేకం, మహా చండీ యాగము, ఏప్రిల్ 02 జగద్గురువుల పాద పూజ. ఏప్రిల్ 3 నుండి 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవ కుంభాభిషేకం నవగ్రహ మహోత్సవాలు, అభిషేకం, హోమము, కళ్యాణం నిర్వహించినట్లు వారు తెలిపారు. బ్రహ్మోత్సవ కుంభాభిషేకం సందర్భంగా ఉచిత హోమంలో పాల్గొనేందుకు భక్తులు డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.శ్రీశక్తీపీఠం . ఓ ఆర్ జి /కుంభ వెబ్సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. లేదా క్రింది ఫోన్ నంబర్లను 9160455255 | 8858853690 | 7737928773 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శక్తిపీఠ కార్యనిర్వాకులు శ్రీకాంత్, ప్రసాద్, శ్రీ మన్న వాల్లన్, హేమ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చక్రేశ్వరస్వామి ఆలయానికి గోవు దానం



శ్రీకాళహస్తి రూరల్, మార్చి30,మనం న్యూస్:తొట్టంబేడు మండలంనెల్లిమానుకండ్రిగ గ్రామంలోని శ్రీ చండికా పరమేశ్వరీ సమేత శ్రీ చక్రేశ్వరస్వామి దేవాలయానికి గోవు దానం కార్యక్రమం జరిగింది. కనుపర్తి ధనంజయులు ఆవు దూడను ఆలయానికి సమర్పించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు చేతుల మీదుగా గోవును ఆలయానికి అందజేశారు. ముందుగా ఆవు దూడలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ, గోవు దానం హిందూ సంప్రదాయంలో అత్యున్నత పుణ్యకార్యమని తెలిపారు. దీనివల్ల పాపాలు తొలగిపోవడం, పితృదేవతలకు శాంతి కలగడం, మోక్షప్రాప్తి లభిస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మృత్యుంజయ స్వామివారికి ప్రత్యేక అభిషేక సేవలు



శ్రీకాళహస్తి, మార్చి30,మనం న్యూస్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయు లింగేశ్వరుని ఆలయ ఆవరణంలో గల మృత్యుంజయ స్వామికి సోమవారాన్ని పురస్కరించుకొని వేద పండితులు ఆధ్వర్యంలో అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో స్వామివారిని వీభూది, కుంకుమ,గంధము,నారికేల, జలము,తేనే, పంచామృతాలతో అభిషేకించారు. తదుపరి స్వామి వారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామి వారు అత్యంత ఆకర్షితుడై భక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పుర ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## అవాస్తవ వీడియోలపై హెచ్చరిక భక్తులకు దేవస్థానం సూచనలు



శ్రీకాళహస్తి, మార్చి30,మనం న్యూస్:శ్రీకాళహస్తి దేవస్థానంపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఆలయ అధికారులు తీవ్రంగా ఖండించారు. ఒక మహిళ చేసిన ఆరోపణలు అసత్యమని, సీసీటీవీ దృశ్యాల ప్రకారం ఆమె సుమారు 9 నిమిషాల పాటు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు.ఆలయంలో ఎవరూ డబ్బులు అడగలేదని అధికారులు స్పష్టం చేశారు. భక్తులను అయోమయానికి గురిచేయడమే లక్ష్యంగా ఇటువంటి అవాస్తవ వీడియోలు సృష్టిస్తున్నారని తెలిపారు.పవిత్ర ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలను సహించబోమని, అటువంటి వారిపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.భక్తులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే అధికారులకు లేదా టోల్-ఫ్రీ నంబర్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో అబద్ధ ప్రచారాలకు దూరంగా ఉండాలని కోరారు.

## మామిడి తోటల పరిశీలించిన రాస్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు



చంద్రగిరి మార్చి 390 మనం న్యూస్: చంద్రగిరి మండలం భీమవరం, పనపాకం మరియు చంద్రగిరి గ్రామాల్లోని మామిడి తోటలను రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సందర్శించారు. ఈ సందర్శనలో ఉద్యాన శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ జనవరి ఆఖరివారం నుండి ఫిబ్రవరి రెండవ వారంలోపు వచ్చిన పూత పిందె కట్టి సుమారు 150-200 గ్రాముల బరువు పెరిగిన దశలో వున్నాయని చెప్పారు. తర్వాత ఫిబ్రవరి రెండవ పక్షంలో ఆలస్యంగా వచ్చిన పూత అధిక పగటి ఉష్ణోగ్రత, చల్లటి రాత్రి ఉష్ణోగ్రతలు వలన పురుగు, తెగుళ్ళ ఉధృతి పెరగటంతో పాటు లేత చిగురు రావటం కారణంగా పిందె సరిగా కట్టలేదని తెలియచేశారు. పూత సమయంలో చీడపీడల నివారణకు వాడవల్సిన మందుల కంటే అదనంగా 2 రకాల సస్యరక్షణ మందులను కలిపి వినియోగించడం, అంతేగాక, ఆ సమయంలో పురుగు, తెగుళ్ల తీవ్రతను గుర్తించి సకాలంలో సరైన సస్యరక్షణ మందులను వినియోగించకపోవటం కూడా పూత, పిందె రాలిపోవడానికి కారణమని ఆయన తెలిపారు. ప్రస్తుతం అధిక నాణ్యమైన కాయ దిగుబడికి పాటించవలసిన మెళకువలు గూర్చి వివరించారు. ప్రస్తుతం గచ్చకాయ, నిమ్మ కాయ దశలో వున్న మామిడి తోటలలో తేనె మంచు పురుగు, తామర పురుగు, పచ్చ పురుగు నల్ల మచ్చ తెగులు నివారణకు అసిఫేట్ 1.5 గ్రా హెక్సాకొనజోల్ 2మిలీ, మల్టి-కె 10గ్రాములు, సూక్ష్మ పోషక మిశ్రమాన్ని 5గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ సమయంలో పిందె రాలుడు నివారణకు సరిపడ నీటి తడులనివ్వాలని సూచించారు. అలాగే, ఫ్రూట్ కవర్స్ 150గ్రాముల కాయ దశలోవున్నప్పుడు తొడగటం వలన పండుఈగ, నల్ల మచ్చ తెగులను సమర్ధవంతంగా నివారించుకోవచ్చునని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు సుధాకర్, అనిల్ కుమార్, రాస్ ప్రాజెక్టు సిబ్బంది సాయి చంద్ర బాబు, కిషోర్ నీరజ్ మరియు మామిడి రైతులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో పండిట్ దీన్ దయాళ్ మహా అభియాన్ శిక్షణ విజయవంతం



శ్రీకాళహస్తి,మార్చి30,మనం న్యూస్:భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ మహా అభియాన్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. స్థానిక ఎన్ వివిఎస్ కన్వెన్షన్ హాల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణ తరగతులకు పార్టీ కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ప్రధాన బాధ్యతలు స్వీకరించి సమర్థవంతంగా నిర్వహించారు. పార్టీ బలోపేతం, సిద్ధాంతాల ప్రచారం, ప్రజాసేవతో పాటు దేశ సేవలో భాగస్వాములు కావాలని కార్యకర్తలకు ఆయన సూచించారు.తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చివరి వ్యక్తికీ చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, కార్యకర్తలు క్రమశిక్షణతో వ్యవహరిస్తూ ప్రజాసేవను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని సూచించారు.ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు చంద్రప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీడి బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, మండల అధ్యక్షులు ఆర్. హరీష్ రెడ్డి, వేదం కృష్ణయ్య, బాగీత్ వెంకటేష్, పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, జీపాలెం తేజోవతి, తిరుమలశెట్టి నరేష్, సీనియర్ కార్యకర్తలు జీవి అమర్నాథ్, చాగణం శైలజ, కె. ప్రసాద్, కన్నా వెంకటేశ్వర్లు, ప్రజ్ఞాశ్రీ, కునాటి నాగరాజు, కొండేటి గోపాల్, రామ్ ఉమా సింగ్, లింగాబతిన గోపాల్, పి. ధర్మయ్య, ఇమ్మిడిశెట్టి మోహన్, రమణ రెడ్డి, మద్దు వాసుయాదవ్, పుణ్యం డిల్లీ కుమార్ రెడ్డి, జి. యతీష్, కృష్ణా రెడ్డి, విజయ కుమార్, మోదుగుల నాగరాజు, పెద్దపాలెం రవి ఆచారి, శ్రీపురం సుధాకర్, కిరణ్మణి, వెంకటేష్, నాగ శేషు,రాజనాల శ్రీకాళహస్తి రూరల్, తొట్టంబేడు, శ్రీకాళహస్తి అర్బన్ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీటీడీ విద్యాసంస్థల్లో

# ఆధునిక విద్యా బోధనకు ప్రత్యేక చర్యలు

- జేఈవో (వైద్యం, విద్య) డా. ఎ. శరత్



తిరుపతి, మార్చి 30,మనం న్యూస్:టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆధునికంగా, నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని టీటీడీ జేఈవో (వైద్యం, విద్య) డా. ఎ. శరత్ అధికారులను కోరారు. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం ఉదయం లెక్చరర్లతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ టీటీడీ విద్యాసంస్థల్లో ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధనతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించినట్లు తెలిపారు. ఇందుకోసం టీటీడీ పాలకమండలి రూ.118 కోట్లను కేటాయించిందని చెప్పారు.పరీక్షల సమయంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, బోధన విధానాలను మెరుగుపరచడం వంటి అంశాలపై ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు పూర్తి స్థాయిలో డిజిటల్ క్లాసులు, మెరుగైన బోధన విధానాలు అమలు చేయనున్నట్లు చెప్పారు.అలాగే పరీక్షల సమయంలో పర్యవేక్షణ, విద్యార్థుల భద్రత, వసతి, భోజనం, పోటీ పరీక్షలకు శిక్షణ, ఉపాధి అవకాశాలకు సంబంధించిన కోర్సులు, వైద్య సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.నూతన విద్యా విధానాలకు అనుగుణంగా టీటీడీ విద్యాసంస్థల్లో మార్పులు తీసుకురావడానికి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు.అనంతరం విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను జేఈవో పరిశీలించి, విద్యార్థులు మరింత మెరుగ్గా అభ్యసించేందుకు అవసరమైన చార్ట్ లు, బోధనా సాధనాలు సిద్ధం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. కిషన్, కామర్స్ శాఖాధిపతి డా. మల్లికార్జున, తెలుగు శాఖాధిపతి డా. ఎన్. బీమన్న, వార్డెన్ డా. ఎం. లోకనాథం, డిప్యూటీ వార్డెన్ వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుక

- వార్డులలో జెండా ఆవిష్కరణ
- టిడిపి రాష్ట్ర నాయకురాలు వెంకట పుష్పావతి యాదవ్



తిరుపతి, మార్చి 29 మనం న్యూస్ : తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పుష్పావతి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని 38, 39, 40, 41 వార్డులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పావతి యాదవ్ ఆయా వార్డులలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరవేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా 38 వ క్లస్టర్ ఇంచార్జ్, రాష్ట్ర కార్యదర్శి పుష్పావతి యాదవ్ మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావుకు తిరుపతి తో ఎంతో అనుబంధం ఉందని, ఆయన తిరుమలలో అన్నదాన పథకం తో పాటు, తిరుపతిలో స్విమ్స్ ఆసుపత్రి, మహిళా యూనివర్సిటీ, తెలుగు గంగ నీళ్ళు వంటి సంక్షేమ పథకాలతో విడదీయరాని బంధం ఉందని గుర్తు చేసుకున్నారు. మహిళలు కు రాజకీయాలలో రాజకీయాలలోకి రావాలని వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావుదేనని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా రాజకీయాల్లోకి రావడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం ఆయన అడుగుజాడల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన కుమారుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకుంటూ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. తిరుపతి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక నిధులు కేటాయించడం ఎంతో ఆనందకరమన్నారు. ఏమైనా త్వరలో పునర్విభజన జరిగితే మహిళలకు రాజకీయంగా రాణించేందుకు రిజర్వేషన్లు వస్తాయన్నారు. రాబోయే రోజులలో రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చెందబోతోందని పుష్పావతి యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కో క్లస్టర్ గణేష్, మురుగ, విశ్వనాథ్, సంతోష్, ధర్మారెడ్డి, ప్రకాష్, బాలాజీ, నారాయణ, రాధిక, ఆదిలక్ష్మి, సుబ్రహ్మణ్యం,హేమలత, శ్రీనివాసుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే పి ఫోర్ కార్యక్రమ లక్ష్యం...శ్రీ లక్ష్మి అధినేత ప్రసాద్

- సేవా కార్యక్రమం చేస్తున్న పలువురుని అభినందించిన అధికారులు



ఎస్ ఆర్ పురం మర్చి 30 మనం న్యూస్: పేదరిక నిర్మూలన నే P4 కార్యక్రమాన్ని లక్ష్యమని నియోజకవర్గ ప్రత్యేక అధికారి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ రావు అన్నారు. గంగాధర నెల్లూరు మండలం కేంద్రంలో P4 కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ P4 కార్యక్రమం ద్వారా పేదరికంలో ఉన్న వారికి అన్ని విధంగా విధాల ఉపయోగపడుతుందని వారి అవసరాల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందు చూపుతో P4 కార్యక్రమాన్ని అమలు చేశారని అన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో పేదల కోసం నిరంతరం కృషి చేస్తున్న శ్రీ లక్ష్మి గ్రూప్ అధినేత ప్రసాద్, పాలసముద్రం మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు మాజీ ఎంపీపీ ఇందిరమ్మ ,వెదురుకుప్పం మండల అధ్యక్షులు మోహన్ మురళి ని సత్కరించి అభినందించారు. వీరు సమాజం పట్ల సేవా భావంతో చాలామంది జీవితాల్లో వెలుగు నింపుతున్నారని వీరు సేవలో ఇలాగనే కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీడి నెల్లూరు ఎంపీడీవో మనోహర్ గౌడ్ ,P4 ప్రత్యేక అధికారి కార్తీక్, పా ఎంపీడీవో సతీష్, ఎస్ఆర్ పురం ఎంపీడీవో వనజ, కార్వేటినగరం ఇన్చార్జ్ ఎంపీడీవో మధుసూదన్, వెదురుకుప్పం ఎంపీడీవో పురుషోత్తం, పెనుమూరు ఎంపీడీవో నీలకంఠేశ్వర్ రెడ్డి, జీడి నెల్లూరు తాసిల్దార్ శ్రీనివాసులు టిడిపి మండల అధ్యక్షులు స్వామిదాస్ పీపీసీ చైర్మన్ మోహన్ నాయుడు ,నియోజకవర్గ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## బిసి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబాటు: దశరథాచారి

శ్రీకాళహస్తి, మార్చి30,మనం న్యూస్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బిసి వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జి. దశరథాచారి తెలిపారు.సోమవారం విజయవాడలోని బిసి భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి సంస్థ డైరెక్టర్లుగా దశరథాచారి సహా పలువురు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా దశరథాచారి మాట్లాడుతూ, రాష్ట్రంలో బిసి వర్గాల సాధికారత కోసం ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్ల అంశంపై చట్టసభల్లో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకునే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు.డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన దశరథాచారిని శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి సంస్థ చైర్మన్ పార్వతి, పలు సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీమతి పార్వతి, డైరెక్టర్ డా.జి.దశరథాచారి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రంగినేని చెంచయ్య నాయుడు,గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,తంగేళ్ళ పాలెం పిఏసియస్ చైర్మన్ బీమాల భాస్కర్, తెలుగుదేశం పార్టీ నాయకులు వజ్రం కిషోర్, పేట బాలాజీ రెడ్డి,కోట చంద్రశేఖర్,కుమార్, కన్నావరం హరిబాబు,మణి,కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల ప్రారంభానికి విచ్చేసిన ముఖ్యమంత్రి

- చంద్రబాబు ఘన స్వాగతం పలికిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు



శ్రీకాళహస్తి, మార్చి 30,మనం న్యూస్:రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 మంది పేద కుటుంబాల గృహప్రవేశాల కార్యక్రమంలో భాగంగా నాయుడుపేటలో టిడ్కో ఇళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. వారికి శ్రీకాళహస్తి శాసనసభ్యులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. లబ్ధిదారులు గృహప్రవేశం చేసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## వినాయక స్వామిని దర్శించుకున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



పూతలపట్టు కానిపాకం మార్చి 30 మనం న్యూస్:శ్రీ స్వయంభు వరసిద్ధి కానిపాకం వినాయక స్వామిని సోమవారం నెల్లూరు రూరల్ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ సూపరిండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు ఉన్నారు.

## రతన్ టాటా సేవలు దేశానికే స్ఫూర్తి - డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేశులు

- ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధిని సాదించాలి...! అధ్యక్షుడు కిషోర్ కుమార్
- సాధికారతను సాదించాలి... ఏపీఎం సీతారామయ్య



చిన్నగొట్టిగల్లు మార్చి 29మనం న్యూస్: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా సేవలు దేశానికే స్ఫూర్తి దాయకమని ఇన్చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేశులు తెలిపారు.సోమవారం చిన్నగొట్టిగల్లులో విలేజ్ ఇన్నోవేటర్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేశులు మాట్లాడుతూ రతన్ టాటా కంపెనీలు స్థాపించిన పలు ఉత్పత్తులు ప్రజల అవసరాలకు తప్పనిసరి అయ్యాయన్నారు. ప్రతి ఆలోచన ఒక శక్తి వంతమైన కార్యరూపం దాల్చి గొప్ప గొప్ప విజయాలు సాదిస్తాయనడానికి రతన్ టాటా వంటి వ్యక్తుల ఆలోచనలే ఆదర్శప్రాయం అన్నారు.బిజెపి మండల అధ్యక్షుడు కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ మరియు స్టార్టప్ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమే "రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్" అని తెలిపారు.ఇలాంటి అవకాశా లను సద్వినియోగం చేసుకొని ప్రతి కుటుంబం అర్థికాభివృద్ధి ని సాదించాలన్నారు. టాటా కంపెనీ ప్రతినిధి రఘు మాట్లాడుతూ మంగళగిరిలో ప్రారంభమైన ఈ హబ్, యువతలోని ప్రతిభను వెలికితీసి, వారిని ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా మార్చే మహత్తర లక్ష్యంతో ఏర్పడిందన్నారు.. రతన్ టాటా స్ఫూర్తితో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా సుమారు 20,000 స్టార్టప్‌లకు మద్దతు, 1 లక్షకు పైగా ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఏపీఎం సీతారామయ్య మాట్లాడుతూ యువత మహిళలు సాధికారతను సాధించే దిశగా ఈ హబ్ ద్వారా మెంటార్‌షిప్, సీడ్ ఫండింగ్, టెక్నాలజీ సపోర్ట్ అందించబడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సస్టైనబిలిటీ వంటి ఆధునిక రంగాలలో అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెలుగు సి సి నారాయణమూర్తి,యంసివో గిరి,నాయకులు ఖదీర్ అహ్మద్, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పి 4 కార్యక్రమం లో శ్రీ లక్ష్మీ గ్రూప్స్ అధినేత ప్రసాద్ కి ఘన సన్మానం



వెదురుకుప్పం. మనం న్యూస్ మార్చి 30: శ్రీ లక్ష్మీ గ్రూప్ ఆఫ్ అధినేత ప్రసాద్ కి సన్మానం పి 4 కార్యక్రమంలో భాగంగా సమాజం కోసం నిరంతరంగా చేసిన సేవలు మరియు అందరికీ అందించిన సహాయం కోసం, ఈ రోజు మన మధ్యకు పిలిచి గౌరవంగా సత్కరించడం మన అందరికీ గర్వకారణమైన క్షణం. ఈ సందర్భంగా 6 మండలాల ఎంపీడీఓలు కలిసి ఆయనను గౌరవించడం మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.ఆయన చేసిన సేవలు, మంచి మనసు మరియు సమాజంపై ఉన్న బాధ్యత మన అందరికీ ఒక ప్రేరణ. పి 4 కార్యక్రమం ద్వారా ఆయన చేసిన సేవలు మరింత మంది జీవితాల్లో వెలుగు నింపుతున్నాయి. ఇలాంటి వ్యక్తులను గౌరవించడం ద్వారా మన సమాజంలో మంచి విలువలు మరింత పెరుగుతాయి.మీ సేవలు ఇలానే కొనసాగాలని ఆకాంక్షిస్తూ, మీ ప్రయాణం మరింత విజయవంతంగా సాగాలని హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం ఆరు మండలాల ఎంపీడీవోలు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దీనదయాళ్ కు ఉద్యోగ భద్రత కల్పించాలి

- పి డబ్ల్యు డి రాష్ట్ర కార్యదర్శి కొండమర్రి సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి



తిరుపతి ప్రెస్ క్లబ్ మార్చి 30 మనం న్యూస్ : శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటి హిస్టరీ డిపార్ట్ మెంట్ లొ ఎం. దీనదయాళ్ అకాడమిక్ కన్సల్టెంట్ గా పనిచేశారన్నారు.సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.దీనదయాల్ కి సుమారు 13 సంవత్సరాల అనుభవం ఉన్నదన్నారు. 2025-26 అకాడమిక్ సంవత్సరానికి గాను రివ్యూ ఆఫ్ పెర్ఫార్మన్స్ పరీక్ష పెట్టి అతనిని ఎస్వీ యూనివర్సిటీ ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. తనకు ఉద్యోగ భద్రత కల్పించాలని పర్సన్స్ విత్ డిసెబుల్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొండమర్రి సుబ్రహ్మణ్యం కోరారు.హిస్టరీ శాఖలో రివ్యూ ఆఫ్ పెర్ఫార్మెన్స్ లో సెలెక్ట్ అయినటువంటి అభ్యర్థులలో మల్లికార్జున్ తప్ప మిగిలిన ముగ్గురు అభ్యర్థుల రీసెర్చ్ పేపర్స్ మొత్తాన్ని కలిపినా ఇతని కున్న అనుభవం, అధ్యాపక అనుభవం లేదని పేర్కొన్నారు.హిస్టరీ డిపార్ట్మెంట్లో అకాడమిక్ కన్సల్టెంట్గా పనిచేస్తున్న ఒకే ఒక దివ్యాంగుడైన దీనదయాళ్ ను ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమన్నారు.దివ్యాంగ చట్టం ప్రకారం గాని మెరిట్ ప్రకారంగానే ఎక్స్పీరియన్స్ ఆధారంగా గాని దీన దయాలకు యూనివర్సిటీ వారు ఉద్యోగం కల్పించాలని కోరారు.దీన దయాళ్ ఆర్థికంగా వెనుకబడిన వాడు చాలా పేదవాడని,అతనికి 80 సంవత్సరాలు వయసు ఉన్న తల్లి,ఇద్దరు పిల్లలు,భార్య ఉన్నారని,అందరూ ఇతని జీతం మీదనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఇతనికి జీతం తప్ప మరి ఏ ఆదాయము, సంపద లేదని ఉద్యోగం నుంచి తొలగించబడడంతో ఏడు నెలలుగా కనీస అవసరాలు కూడా తీర్చుకోలేకపోతున్నాని,చాలా దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నానని దీన దయాళ్ పేర్కొన్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల కమిషనర్,ఎస్ వి యూనివర్సిటీ అధికారులకు, 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం అతని ఉద్యోగం అతనికి ఇవ్వమని, యూనివర్సిటీ అధికారులకు తెలియజేశారు అన్నారు. వాళ్ల ఆదేశాలను అధికారులు లెక్క చేయలేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ,గవర్నర్, ఉపరాష్ట్రపతి కార్యాలయాలు,జిల్లా కలెక్టర్ కూడా దీనదయాళ్ కు న్యాయం చేయాలని యూనివర్సిటీ అధికారులకు ఉత్తరాలు పంపారని అన్నారు. అయినా కూడా అధికారులు అందించలేదని పేర్కొన్నాడు.తనకు న్యాయం చేయాలని యూనివర్సిటీ రిజిస్టర్ ని,సంబంధిత అధికారులను కోరుతున్నానని చెప్పారు.

## పుత్తూరులో బ్రాహ్మణ సంక్షేమానికి కొత్త దిశ

అడహక్ కమిటీ అధ్యక్షుడిగా బాలాజీ శర్మ ఏకగ్రీవ ఎంపిక



పుత్తూరు,మార్చి,30, మనం న్యూస్ పుత్తూరు పట్టణంలోని బెస్త వీధిలో వెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయం సమీపంలో బ్రాహ్మణ బంధువుల ఆత్మీయ సమావేశం గౌరవ అధ్యక్షులు ఆలూరి రామకృష్ణ ఆధ్వర్యంలో బాలాజీ శర్మ స్వగృహంలో నిర్వహించారుశ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం పుత్తూరు ఆధ్వర్యంలో జరుగుతున్న పలు సేవా కార్యక్రమాల నేపథ్యంలో, బ్రాహ్మణుల సంక్షేమం, విద్యార్థులకు స్కాలర్షిప్ లు, ప్రభుత్వానికి నివేదిక సమర్పణ వంటి అంశాలపై చర్చించి కొత్త అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యుల ఏకగ్రీవ నిర్ణయంతో కే. బాలాజీ శర్మను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే వైస్ చైర్మన్ గా సాయినాధరావు, సభ్యులుగా విజయ్ కుమార్, బాలాజీ రావు, రాహుల్, శ్రీమతి పద్మప్రియలను ఎంపిక చేశారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బాలాజీ శర్మకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ అభినందనలు తెలిపారు. అలాగే కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన ఆలూరి రామకృష్ణ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.కమిటీ సభ్యులు తమపై పెట్టిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో పుత్తూరు గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ దర్శనాలకు పాల్పడిన సిబ్బందిపై సస్పెన్షన్, తొలగింపు

- కమాండ్ కంట్రోల్ పర్యవేక్షణలో అక్రమాలు బట్టబయలు



శ్రీకాళహస్తి, మార్చి30,మనం న్యూస్:శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది సిబ్బంది భక్తుల నుండి డబ్బులు తీసుకుని దర్శనాలకు పంపుతున్న ఘటనను ఆలయ కార్యనిర్వాహణాధికారి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా గుర్తించారు. ఈ నేపథ్యంలో సంబంధిత సిబ్బందిపై తక్షణ కఠిన చర్యలు తీసుకున్నారు.సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న గురవమ్మ, విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు భక్తుల నుండి డబ్బులు స్వీకరించి దర్శనాలకు పంపినట్లు నిర్ధారణ కావడంతో వారిని విధుల నుండి తొలగించారు.అదేవిధంగా దేవస్థానం కాంట్రాక్ట్ సిబ్బందిలో అర్చన కౌంటర్ లో పనిచేస్తున్న సి. విజయ్ కుమార్, అలాగే ప్రసాదం పోటులో ఔట్సోర్సింగ్ సిబ్బందిగా ఉన్న పి. పెంచలయ్య తమ విధులను నిర్లక్ష్యం చేసి భక్తులను దర్శనాలకు తీసుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో వారిని విధుల నుండి నిలుపుదల (సస్పెండ్) చేశారు.భక్తులకు ఇబ్బందులు కలిగించే విధంగా, నిబంధనలు ఉల్లంఘిస్తూ వ్యవహరించే సిబ్బందిపై ఇలాంటి కఠిన చర్యలు కొనసాగుతాయని ఆలయ అధికారులు స్పష్టం చేశారు.

## విద్యార్థుల ఫీజుల దోపిడీ నేరగాళ్లు పై సీఎం స్పందించాలి.

- అఖిల పక్ష పార్టీలు డిమాండ్.



తిరుపతి ప్రెస్ క్లబ్ మార్చ్ 30 మనం న్యూస్ : పేద విద్యార్థులకు ఇబ్బంది పెడుతూ వారి నుంచి ఫీజులు దోపిడీ చేస్తున్న ఆర్థిక నేరగాళ్లు కిడ్నాపర్స్ మోహన్ బాబు మంచు విష్ణు ల అరెస్టుపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలని తిరుపతికి చెందిన అఖిలపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు తిరుపతి ప్రెస్ క్లబ్లో సోమవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో నాయకులు వందవాసి నాగరాజు పి. అంజయ్యలు మాట్లాడారు. రంగంపేట సమీరం బాబు విద్యాసంస్థలలో విద్యార్థులు పట్ల అధిక ఫీజులు చేస్తూ విద్యార్థులు పెడుతున్నారని కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అలాగే ముఖ్యమంత్రి ప్రత్యేకంగా శ్రద్ధ వహించి పేద పిల్లలకు తగు న్యాయం చేయాలని స్థానిక వామపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు

## శ్రీకాళహస్తి నియోజకవర్గంలో CSR ఫండ్స్ తో ఉచిత వైద్య సేవలు



తొట్టంబేడు, మార్చి3 0 , మ న ం న్యూస్:శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు CSR ఫండ్స్ తో గ్రీన్ ప్యానెల్ ఫౌండేషన్ గ్రామాల వారీగా ఉచిత వైద్య సేవలను అందిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల తొట్టంబేడు మండలంలోని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలకు ఉచిత మెడికల్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన ప్రాథమిక మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.ఎమ్మెల్యే స్వయంగా కార్యక్రమం పురోగతిని సమీక్షిస్తూ, తగిన సూచనలు అందిస్తూ అమలు పర్యవేక్షిస్తున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో గ్రీన్ ప్యానెల్ బృందం గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు అక్కడికక్కడే చికిత్స అందిస్తోంది.గ్రామీణ ప్రాంత ప్రజలకు సులభంగా ఆరోగ్య సేవలు చేరవేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సేవల ద్వారా ప్రజలు ఎటువంటి ఖర్చు లేకుండా ప్రాథమిక వైద్యం పొందుతున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని అభినందించిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో గ్రీన్ ప్యానెల్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

## జిల్లా ఇంచార్జ్ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసిన రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు



మదనపల్లి మార్చి 30 (మనం న్యూస్): అన్నమయ్య జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు మరియు రాష్ట్ర రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాల శాఖ మంత్రివర్యులు శ్రీ బి.సి. జనార్ధన్ రెడ్డి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు సోమవారం రోజు మదనపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు మదనపల్లిలో నిర్వహించనున్న 'జీరో పావర్టీ – P4' కార్యక్రమం మొదటి వార్షికోత్సవ వేడుకలకు హాజరయ్యేందుకు విచ్చేసిన మంత్రి పార్లమెంట్ అధ్యక్షులు ప్రసాద్ బాబు స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా శ్రీరామ్ చినబాబు రాజంపేట టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో కలిసి మాట్లాడినారు ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజా సమస్యలు అభివృద్ధి అవసరాలు అలాగే టీడీపీ నాయకులు కార్యకర్తలు ఎదుర్కొంటున్న అంశాలను మంత్రి దృష్టికి ప్రసాద్ బాబు తీసుకువెళ్లి వివరించారు ప్రజల సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల అమలులో వేగం పెంచేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ప్రసాద్ బాబు తెలిపారు.

## ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు P4 పథకం: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి, మార్చి30,మనంన్యూస్:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న P4 (పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ పార్ట్ నర్ షిప్) పథకం ప్రజలకు విస్తృత ప్రయోజనాలు అందిస్తోందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి గల నాయకుడిగా రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు."సీబీఎన్ అంటే ఒక నమ్మకం... సీబీఎన్ అంటే క్రమశిక్షణ... సీబీఎన్ అంటే విజనరీ... సీబీఎన్ అంటే అభివృద్ధి... సీబీఎన్ అంటే ఆంధ్రప్రదేశ్" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ వయస్సులో కూడా 25 ఏళ్ల యువకుడిలా రాష్ట్ర అభివృద్ధి కోసం కష్టపడుతున్న నాయకుడు చంద్రబాబు నాయుడేనని అన్నారు.చంద్రబాబు నాయుడు విజనరీకి కార్యరూపమే ఈ P4 పథకమని, పేదవాడిని ధనవంతుడిగా మార్చడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేదల అభివృద్ధి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ఈ పథకం అసలు ఉద్దేశమని తెలిపారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు కంపెనీలు P4 పథకానికి తమ వంతు సహకారం అందిస్తూ ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలకు తోడ్పాటు అందించిన సంస్థలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే, టిట్కో గృహాల నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేసిందని ఆరోపించారు. తాము ప్రారంభించిన గృహాలు పూర్తయ్యే దశలో ఉండగా పనులు ఆపివేసారని ఎద్దేవా చేశారు. అలాగే గృహాలకు భారీ మొత్తంలో ఖర్చు చేసి కేవలం రంగులు వేసే పనికే పరిమితమయ్యారని విమర్శించారు.అభివృద్ధి అంటే ఏమిటో తెలియని నాయకత్వం గతంలో ఉందని, ప్రస్తుతం మాత్రం సీఎం చంద్రబాబు నాయుడు సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే నిజమైన నాయకుడు చంద్రబాబు నాయుడేనని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండలం అధ్యక్షులు రావిళ్ళ మునిరాజ నాయుడు, తొట్టంబేడు మండల రెవిన్యూ అధికారి,రెవిన్యూ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి భాషకు ఘన సన్మానం

- 110 ఓట్లకు 74 ఓట్లు సాధించారు
- నిజాయితీ నిబద్ధతతోనే 40 ఓట్ల మెజారిటీ
- బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్ ప్రభాకర్ రెడ్డి ప్రశంసలు

రాయచోటి మార్చి 30 మనం న్యూస్: 2026-27 సంవత్సరానికి గాను శనివారం జరిగిన న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా తన ప్రత్యర్థి పై 40 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచిన పి. రెడ్డి భాషాను రాయచోటి న్యాయవాదులు ఘనంగా సన్మానించారు రాయచోటి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్ ప్రభాకర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని న్యాయవాదులు అందరి తరపున ప్రధాన కార్యదర్శి పి. రెడ్డి భాష ను ఘనంగా సన్మానించారు గత 15 సంవత్సరాలుగా రాయచోటి బార్ అసోసియేషన్ ఆదాయ వ్యయాల రికార్డులను కచ్చితంగా వ్రాసిన చరిత్ర ఒక రెడ్డి భాషా కే దక్కుతుందని ఆయన అన్నారు అందుకే న్యాయవాదులు అందరూ కూడా అతనిపై నమ్మకం ఉంచి రెండవ సారి కూడా ప్రధాన కార్యదర్శిగా 40 ఓట్ల అత్యధిక మెజారిటీతో గెలిపించారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మీదేవి సహాయ కార్యదర్శి వి.సిద్దయ్య, ట్రెజరర్ కృష్ణమ లైబ్రరీ సెక్రటరీ మహబూబ్జాన్ స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ టీవీ రమణ న్యాయవాదులు శెట్టిపల్లి ప్రభాకర్ రెడ్డి రాజ్ కుమార్ రాజు ఆనంద్ కుమార్ టి ఈశ్వర్ హుమయున్ భాష దేవేందర్ రెడ్డి ధనుంజయ్ కుమార్ ఉదయగిరి రామాంజులు వీరభద్రయ్య,ఎం రవిశంకర్ నిరంజన్ టీవీ రమణ సుబ్బరాయుడు హరీష్ మల్లికార్జున నాగేంద్ర, ఇర్షాద్, రామచంద్ర, శివకుమార్ భరత్ తదితరులు పాల్గొన్నారు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి భాషను సన్మానిస్తున్న న్యాయవాదులు

## ఏర్పేడు ఎమ్మార్వో కార్యాలయంలో పట్టాదారు పాస్ బుక్స్ పంపిణీ



ఏర్పేడు,మార్చి30, మనంన్యూస్: ఏర్పేడు ఎమ్మార్వో కార్యాలయంలో పట్టాదారు పాస్ బుక్స్ పంపిణీ కార్యక్రమం సోమవారం ఎమ్మార్వో భార్గవి మరియు ఏర్పేడు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో భార్గవి లబ్ధిదారులకు పాస్ బుక్స్ అందజేశారు. రైతులకు భూ హక్కులను ధృవీకరించే ముఖ్యమైన పత్రాలుగా పట్టాదారు పాస్ బుక్స్ ఉపయోగపడతాయని ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ సేవలను రైతులకు సులభంగా అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగ కరంగా ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.పాస్ బుక్స్ అందుకున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ భూములపై స్పష్టత రావడంతో భవిష్యత్తులో వ్యవసాయ కార్యకలాపాలు మరింత సులభంగా సాగుతాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ ఏర్పేడు మండల అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు మరియు రైతులు పాల్గొన్నారు.

## నిరుపేదలను ఆదుకోవడంలో కీలక పాత్ర పోషించిన టిడిపిమండల కన్వీనర్ దొరబాబు చౌదరికి ఘన సన్మానం!



పూతలపట్టు మార్చి 30 మనం న్యూస్:నిరుపేదలను గుర్తించి ఆదుకోవడంలో కీలకపాత్ర వహించిన పూతలపట్టు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరిని సోమవారం పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఘనంగా సన్మానించారు సోమవారం పి4 కార్యక్రమంలో భాగంగా మండల అభివృద్ధి కార్యాలయ సమావేశం లో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి తగిన మౌలిక వసతులను కల్పించడంతో మండల దొరబాబుచౌదరి కీలకపాత్ర వహించాడ నిఆయన కొనియాడారు అనంతరం ఎమ్మెల్యే తో పాటు పదవ తరగతిలో నాయకులు ఆయన్ని దుస్సాలవకప్పి ఘనంగా సత్కరించారు

## ఏపీ ఎన్జీవో మహిళా విభాగం డివిజన్ యూనిట్ అధ్యక్షురాలుగా లావణ్య.



పీలేరు మార్చి 30 మనం న్యూస్: ఏపీ ఎన్జీవో మహిళా విభాగం అ ధ్యక్ష, ఉ పాధ్యక్ష, కోశాధికారి, కన్వీనర్ల ఎన్నిక పీలేరు డివిజన్ క్లస్టర్ యూనిట్ ఏపీ ఎన్జీవో పీలేరు డివిజన్ యూనిట్ అధ్యక్షులు వై రెడ్డప్పనాయుడు కార్యదర్శి వెంకట్ రమణ కోశాధికారి బాలసుబ్ర మణ్యం, సర్వేర్ల సంఘం అధ్యక్షుడు రమేష్ బాబు సంయుక్త కార్యదర్శులు శివప్రసాద్ బాబు మనోహర్ ఆధ్వర్యంలో మహిళా కార్యదర్శి దివ్య దీపిక సమక్షంలో 12 మంది మహిళలను ఎన్నుకోవడం జరిగిందని. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాపై నమ్మకంతో ఈ బృహత్తరమైన బాధ్యతలను మాకు అప్పగించినందుకు శక్తి వంచన లేకుండా పనిచేసి ఏపీ ఎన్జీవో సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు మహిళా విభాగం సభ్యులు.

## మొగిలేశ్వర స్వామి ఆలయంలో సర్ప దోష నివారణ పూజలు

బంగారుపాళ్యం మార్చ్ 30 మనం న్యూస్. శ్రీ మొగిలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 7:3ద్య0 నుండి 9 గంటల వరకు ఆలయంలో సర్ప దోష నివారణ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి మునిరాజు. ఆలయ ధర్మకర్త ఎం. బి. విజయకుమార్ నాయన వారు సోమవారం తెలిపారు. ఆలయ సాంప్రదాయపకరం ఆలయ అర్చకులు గంగాధరం గురుకుల. రెడ్డప్ప గురుకుల. అష్టోత్తర గురుకుల. సోమేశ్వర గురుకుల. ఆలయం శుభ్రపరిచి ఆలయానికి మండలంలోని మొగిలి. మొగిలి వారి పల్లి. బలిజిపల్లి. టేకుమంద. బంగారుపాళ్యం. ఇందిరమ్మ కాలనీ. జిల్లాలోని పలమనేరు. చిత్తూరు. బైరెడ్డిపల్లి. కుప్పం. జిల్లా గార్జిల్లా అన్నమయ్య జిల్లా. బాలాజీ జిల్లా. రాష్ట్రముగా రాష్ట్రం తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల నుండి. సోమవారం కాడముతో ముగిలేశ్వర స్వామి ఆలయంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సర్ప దోష నివారణ పూజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది. ఆలయ ఇన్స్పెక్టర్ శరవణ. మధు. బాలాజీ. భక్తులకు అన్ని వసూలు ఏర్పాటు చేశారు.

# వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు ప్రాధాన్యం

- ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



తిరుపతి, మార్చి 30:ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని ఆ సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసులో సోమవారం ఉదయం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో చోటుచేసుకుంటున్న జాప్యాన్ని సీఎండి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీఎండి మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రైతులకు ఫోన్ చేసి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. సర్వీసుల మంజూరులో నిబంధనలను అతిక్రమిస్తే సంబంధిత అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా సెక్షన్ల వారీగా వ్యవసాయ విద్యుత్ సర్వీసు దరఖాస్తుల సీనియారిటీ లిస్టును నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. అదేవిధంగా ఇంటి స్థలాలు, పొలాల్లో విద్యుత్ లైన్లు, స్తంభాల ఏర్పాటు సందర్భంలో భూ యజమానులకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. కాగా సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమం ద్వారా 56 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ & హెచ్ఆర్ డి) కె. గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె. రామ మోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, కె. ఆదిశేషయ్య, యం. మురళీ కుమార్, యం. కృష్ణా రెడ్డి, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, జనరల్ మేనేజర్లు సురేంద్ర రావు, విజయన్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ యొక్క ముఖ్య ద్యేయం!

- దేశాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశం :!
- ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్



పూతలపట్టు మార్చి 30 మనం న్యూస్: పేదరికం లేని సమాజాన్ని చూడడమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యొక్క ముఖ్య ఉద్దేశమని పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరిమురళీమోహన్ కొనియాడారు పి ఫోర్ కార్యక్రమం లో భాగంగా సోమవారం పూతలపట్టు మండల అభివృద్ధి కార్యాలయం సమావేశం మందిరములో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు సందర్భంగా ఎమ్మెల్యే మురళి మోహన్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు పదివేల 66 కుటుంబాలని నిరుపేద కుటుంబానికి గుర్తించిఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు అందులో 64 07 కుటుంబాలు లబ్ది పొందారని ఆయన కొనియాడారు నియోజకవర్గ పరిధిలో ప్రతి సచివాలయ పరిధికి సంబంధించినిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి కావలసిన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు అంతకుముందు మండల అభివృద్ధి అదనపు కార్యాలయానికి శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి స్పెషల్ ఆఫీసర్సూరిబాబు టిడిపి జిల్లా కార్యదర్శి షణ్ముఖ రెడ్డి ఎంపీడీవో నాగరాజు డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులుఆనంద్ రెడ్డి ఏఎంసీ చైర్మన్ భాస్కర్ నాయుడు ఎంపీపీ కుమారి సింగల్ విండో అధ్యక్షులు ఇంద్రసేన నాయుడు మాజీకన్వీనర్ చంద్రమౌళి వెలుగు ఏపిఎంసింగన్న ఏపీవో సంధ్యారాణి వ్యవసాయ అధికారిని మధురవాణి తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు నిరుపేద కుటుంబాల అన్న పిల్లలు చదువుకునే వారికి మేము ఇంజనీరింగ్ కళాశాల నందు ఉచితంగా చదివిస్తామని కరస్పాండెంట్ చంద్రశేఖర్ నాయుడు తెలిపారు నందు గ్రామాల్లో అభివృద్ధి చేసిన వారికి సత్కరించినారు రోషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం




శాంతిపురం మండలం మార్చి 30 మనం న్యూస్:మండలం పరిధిలోని రాళ్ళబూదుగూరు గ్రామంలో సోమవారం నూతన టిడ్కో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు గౌరమ్మ గంగులప్ప గృహ తాళాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ టిడ్కో గృహ నిర్మాణాల ప్రాముఖ్యతను వివరించారు.2014–19 కాలంలో ప్రారంభమైన గృహ నిర్మాణ ప్రాజెక్టుల నేపథ్యాన్ని, అమలు విధానాన్ని మరియు తరువాత ఏర్పడిన పరిస్థితులను వివరించారు.రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట లో రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పాల్గొనడం జరిగిందన్నారు. ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం మాట్లాడుతూ ప్రజలు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి మరియు పునర్నిర్మాణం కోసం విశ్వాసంతో ప్రస్తుత నాయకత్వానికి చారిత్రాత్మకమైన మద్దతు ఇచ్చారన్నారు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని క్రమబద్ధీకరించడం తో పాటు, సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతుల్యత సాధిస్తూ ముందుకు సాగుతోందన్నారు.ఈ గృహ ప్రవేశాల కార్యక్రమం, ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడంలో కీలక అడుగుగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతూ, రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తున్నామని తెలిపారు. అనంతరం పిఎంకె హుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ

ప్రతి పేద కుటుంబం సొంత ఇంటితో సుఖంగా జీవించాలి అనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని గూడు లేని నిరుపేదలను గుర్తించి వారికి సొంతింటి కలను సాకారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించాను.పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాను.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.5 లక్షల ఇళ్ల గృహ ప్రవేశాలను ప్రారంభించిన సందర్భంగా,కుప్పం నియోజకవర్గంలో కూడా లబ్ధిదారులకు గృహ తాళాలు అందజేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం, మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్ ,ఏ యం ఎస్ ఎస్ చైర్మన్ గోపాల్, స్టేట్ లేబర్ డైరెక్టర్ విశ్వనాథ నాయుడు, రెస్కో డైరెక్టర్ బసవరాజు,కడ అడ్వైజ్ మెంబర్ సుగుణమ్మ,నాయకులు విజయరామిరెడ్డి,ఆర్ ఎస్ మని, చంద్ర, గిరిధర్, నాగరాజు, మంజునాథ్, కుమార్, మురళి మరియు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధి కే ఉచిత వైద్య శిబిరాలు.

- పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకట ముని నాయుడు



కలికిరి, మార్చి 30: మనం న్యూస్ :పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసిందని పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకట ముని నాయుడు అన్నారు. కలికిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో, పశుసంవర్ధక శాఖ సహకారంతో సోమవారం కొటాల గ్రామంలో సోమవారం మెగా ఉచిత పశువైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధకానికి ప్రోత్సాహం అందించడంతో పాటు, రైతుల పశువుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలికిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాలతి మాట్లాడుతూ, పశుసంపద రైతుల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమైన వనరని తెలిపారు. పశువుల ఆరోగ్య సంరక్షణ ద్వారా పాలు, పశువుల ఉత్పత్తులు పెరిగి రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పశుసంవర్ధక సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ శిబిరంలో పశువులకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, టీకాలు, క్రిమినాశకాలు వంటి సేవలు అందించారు. అనేక మంది రైతులు తమ పశువులను తీసుకువచ్చి వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా అధికారులు పశువుల సంరక్షణ, పోషణ, వ్యాధి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.పలువురు ప్రసంగిస్తూ, ఇలాంటి శిబిరాలు గ్రామీణ రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ముఖ్యంగా పశువులకు ఇన్సూరెన్స్ సదుపాయం తీసుకోవడం ద్వారా అనుకోని నష్టాల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాస్ వర్మ, రాంబాబు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి శంకర్ రెడ్డి, మర్రికుంటపల్లి సర్పంచ్ రెడ్డి రాం , గ్రామ నాయకులు చల్లయ్య, టిడిపి సీనియర్ నాయకులు చిన్న రెడ్డయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి టాటా క్యాన్సర్ హాస్పిటల్లో ఆంకాలజీ నర్సింగ్, ఆంకోపాథాలజీ పై ప్రతిష్టాత్మక సదస్సు.

- వైద్య రంగంలో నైపుణ్యాభివృద్ధికి నిపుణుల శిక్షణ – 200కు పైగా ఆంకాలజిస్టులు డాక్టర్లు, పాథాలజిస్టులు డాక్టర్లు తో సదస్సు.






తిరుపతి, మార్చి 30, 2026 :టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ & అడ్వాన్స్ డ్ రీసెర్చ్ (SVICCAR) లో ఆంకాలజీ నర్సింగ్ మరియు ఆంకోపాథాలజీ అంశాలపై రెండు కీలక విద్యా సదస్సులు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. వైద్య రంగంలో నైపుణ్యాలను పెంపొందించడం, రోగి సంరక్షణ ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు.మొదటిగా “Educate, Empower, Evolve” అనే థీమ్ తో ఆంకాలజీ నర్సింగ్ ఎక్సలెన్స్ సదస్సు నిర్వహించగా, 247 మంది నర్సింగ్ నిపుణులు పాల్గొన్నారు. ఇందులో ఇన్ఫెక్షన్ నియంత్రణ, వర్క్ ప్లేస్ భద్రత, సెంట్రల్ లైన్ ఇన్ఫెక్షన్లు (CLABSI), వెంటిలేటర్ కు సంబంధించిన న్యుమోనియా నివారణ వంటి అంశాలపై నిపుణులు విశ్లేషణాత్మకంగా శిక్షణ అందించారు. అదనంగా, IV కేర్ మరియు ఇన్ఫెక్షన్ కంట్రోల్ డాక్యుమెంటేషన్ పై హ్యాండ్స్-ఆన్ వర్క్ షాప్ నిర్వహించి, ప్రాయోగిక పరిజ్ఞానాన్ని పెంపొందించారు. జూ పార్క్ రోడ్డు లో టాటా కేర్ హాస్పిటల్ లో ఆన్కో-పాథాలజీలో ఉత్తమ అభ్యాసాలు (“Best Practices in Onco-Pathology”) పేరుతో ఆంకోపాథాలజీ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంకాలజిస్టులు, పాథాలజిస్టులు పాల్గొని క్యాన్సర్ నమూనాల గ్రాసింగ్, ఫ్రోజన్ సెక్షన్ నిర్ణయాలు, రొమ్ము మరియు తల-మెడ క్యాన్సర్ రిపోర్టింగ్ విధానాలపై లోతైన చర్చలు జరిపారు.విద్యా కార్యక్రమాలతో పాటు క్విజ్ మరియు పోస్టర్ ప్రెజెంటేషన్లు నిర్వహించి, విజేతలకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా SVICCAR మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ పెనుమడు మాట్లాడుతూ, ఖచ్చితమైన పాథాలజీ రిపోర్టింగ్ మరియు నైపుణ్యం కలిగిన నర్సింగ్ సేవలే క్యాన్సర్ చికిత్సకు పునాది అని పేర్కొన్నారు. రోగి భద్రతను మెరుగుపరచడం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వైద్య సేవలు అందించడంలో ఇటువంటి విద్యా సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు.




## కందూరులో చలివేంద్రం ఏర్పాటు

సోమల మార్చి 30 మనం న్యూస్:సోమల మండలం కందూరు మేజర్ గ్రామ పంచాయతీ బస్టాండ్ నందు ప్రజల సౌకర్యార్థం కోసం దాహార్తి తీర్చడానికి మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎండ తీవ్రత 34 డిగ్రీల వరకు చేరుకుందన్నారు. ఈ నేపథ్యంలో పల్లె ప్రాంతాల నుంచి తరలివచ్చే గ్రామ ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జన సంచారమున్న కూడళ్లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందూరు మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు నగిరిండ్ల సుబ్బరాయుడు మరియు నాయకులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ రిజిస్టర్ను బర్తరఫ్ చేయాలి

- సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- విద్యార్థి సంఘాల ఐక్యవేదిక జేఏసీ నాయకులు డిమాండ్




తిరుపతి ప్రెస్ క్లబ్ మార్చి 30 మనం న్యూస్ : తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థులు పట్ల జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి వెళ్లిన విద్యార్థులపై ఎస్ వి యు రిజిస్టర్ భూపతి నాయుడు నానా దుర్భాషలాడి కులం పేరుతో దూషించారని విద్యార్థి సంఘ నాయకుడు శంకర్ నాయక్, ప్రేమ్ లు ఆవేదన వ్యక్తం చేశారు తిరుపతి ప్రెస్ క్లబ్ లో సోమవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. యూనివర్సిటీ రిజిస్టర్ అనేక అవినీతి అక్రమాలు చేస్తున్నారని తనకు సంబంధించిన బందు వర్గానికి అర్హత లేకపోయినా ఉద్యోగాలను కట్టబెడుతున్నారని వారు విమర్శించారు. అలాగే విద్యార్థులు పెంచాల్సిన నిధులు పక్కదో పట్టిస్తున్నారని వారు విమర్శించారు కూటమి ప్రభుత్వం వెంటనే రిజిస్టర్ పై సిటింగ్ గజ్జితో విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని వారి డిమాండ్ చేశారు విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘాల ఐక్య నాయకులు పాల్గొన్నారు

## నీటి కుంటలా తలపిస్తున్న పీలేరు ప్రధాన రహదారి



సుండుపల్లె మార్చి 30 మనం న్యూస్: మండల కేంద్రమైన సుండుపల్లె లోని శివాలయం ఎదురుగా రోడ్డు నీటి కుంటలా మారింది ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి పాత పోలీస్ స్టేషన్ భవన శివాలయాల ఎదురుగా పీలేరు రోడ్డుపై వర్షపు నీరునిలవడంతో అక్కడ రోడ్డు కుంటను తలపిస్తోంది పాత పోలీస్ స్టేషన్ భవనంలోకి వెళ్లే ప్రహరీ గేటు స్థానంలో పోలీసులు గోడ కట్టడం తో వర్షపు నీరు ప్రక్కకు వెళ్ళడానికి అవకాశం లేక అక్కడే సుమారు రెండడుగుల మేర నిలిచాయి దీంతో ఆమార్గం లో నడచి వెళ్ళేవారికి ఇబ్బందులు తప్పలేదు పాత పోలీస్ భవనం పూర్వ గేటు వద్ద రోడ్డు పై వచ్చే వర్షపు నీరు వెళుతుండేవి అయితే పాత స్టేషన్ భవనం ప్రహరీ గేటు మార్పు లో భాగంగా అక్కడ పోలీసులు గేటు తొలగించి గోడ నిర్మాణం చేపట్టారు దీంతో తగ్గుగా వున్న రోడ్డులో నీరు నిలిచాయి ఈ నీరు వెళ్ళడానికి రోడ్డు ప్రక్కన కాలువ తీయాల్సిన అధికారులు పట్టించుకోలేదు వర్షపు నీరు వెళ్లే చోట పోలీసులు గోడ నిర్మించడంతో నే నీళ్లన్ని నిలిచిపోయాయాని పలువురు పేర్కొంటున్నారు వాహన రాకపోకలతో వర్షపు నీరు మురికిగా మారి వాహనాలు అధ్వాన్నంగా మారుతున్నాయని బురదగా మారిన నీటిలో నడవాల్సి వస్తోందని పంచాయతీ అదికారులైన అక్కడ రోడ్డు ప్రక్కన కాలువ తీయించి వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని వాహన దారులు పాద చారులు కోరుతున్నారు

## చౌడేపల్లి మండలం కొండా మరి గ్రామపంచాయతీ కోటూరు ప్రాథమిక పాఠశాలలో దత్తత తీసుకున్న సీనియర్ కార్యకర్త కేంద్రమౌళికి పి ఫోర్ అవార్డు.



చౌడేపల్లి మార్చి 30 మనం న్యూస్: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పెద్ద కొండా మరి మాజీ సర్పంచ్ పూల చంద్రమౌళికి పి ఫోర్ ధ్రువీకరణ పత్రం అందించి సత్కరించారు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపును స్వాగతిస్తూ కోటూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి దిశగా పనులను ఆయన చేపట్టారు ఇందుకుగాను నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరులో ఎంపీడీవో కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమం లో పూల చంద్రమౌళికి పి4 ధ్రువీకరణ పత్రం ఎంపీడీవో లీలా మాధవి అధికారులు నాయకులు అందించారు దీంతో పలువురు ఆయనను అభినందించారు ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు చేస్తానని ఈ సందర్భంగా పూల చంద్రమౌళి అన్నారు

## పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

మనం న్యూస్ సదుం మార్చి 30: అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం సదుం మండలం చెరకవారిపల్లిలో పిచ్చికుక్క దాడిలో ఒక బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన సదుం మండలంలో చోటు చేసుకొంది గ్రామస్తుల కథనం మేరకు చెరుకువారిపల్లి గ్రామానికి చెందిన బావాజీ కుమారుడు మస్తాన్ (13) ఇంటివద్ద కూర్చుని ఉండగా సోమవారం సాయంత్రం పిచ్చికుక్క దాడి చేసింది. ఈ దాడిలో బాలుడికి గాయాలయ్యాయి. అతన్ని సదుం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతని గాయాలను చూసిన వైద్యులు కనీసం 10 రోజులపాటు వైద్యశాలలోనే ఉండాలని చెప్పారు. గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువ కావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో పలుమార్లు అధికారులకు తెలియజేసిన ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం అధికారులు చొరవ తీసుకొని ప్రజలు కుక్కల భారిన పడకుండ చూడాలని వాటిని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## కుల వృత్తులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు భరోసానివ్వాలి

- నాయిబ్రాహ్మణుల డిమాండ్



బి.కొత్తకోట మార్చి 30 మనం న్యూస్ : కులవృత్తులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు భరోసానివ్వాలని నాయి బ్రాహ్మణులు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఆదివారం పట్టణంలో నాయి బ్రాహ్మణ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న యజమానులు,వర్కర్లు.ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజవర్గం నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు హరిచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల నూతన హంగులతో బార్బర్ షాప్ ను ప్రారంభించారని,ఇది తమ జీవనోపాధిపై పెను ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆ బార్బర్ షాపును తక్షణమే మూసివేయాలంటూ స్థానిక నాయి బ్రాహ్మణులు డిమాండ్ చేశారు.కుల వృత్తినే నమ్ముకున్న నాయి బ్రాహ్మణులే కాకుండా ఇతర రాష్ట్రాలకి చెందిన క్షవరశాలలు నిర్వహించడం సరికాదన్నారు. ఇతరులు నిర్వహిస్తున్న సెలూన్ లను రద్దు చేసి,స్థానిక నాయి బ్రాహ్మణులు సమస్యలను పరిష్కరించాలని నాయి బ్రాహ్మణులు సంఘ నేతలు డిమాండ్ చేశారు. సెలూన్ షాప్ నిర్మాణంలో ఉన్నట్లుగానే గతంలోని నగర పంచాయతీ కమిషనర్ వెంకట్రామయ్యకు వినతి పత్రాన్ని అందజేశామని నాయి బ్రాహ్మణులు సంఘ నాయకులు తెలిపారు ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కులవృత్తి నిర్వహించే స్థానికులకే అనుమతులు ఇవ్వాలని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి సెలూన్ షాప్ నిర్వహిస్తాం అనేవారికి అధికారులు అనుమతులు ఇవ్వకూడదని వారు డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం బి.కొత్తకోట మండల అధ్యక్షుడు మల్లికార్జున,మండల ఉపాధ్యక్షుడు గణేష్ డిమాండ్ చేశారు.

## తవణంపల్లిమండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

- అంగన్వాడి భవనం . సిసి రోడ్డు. ప్రారంభించిన ఎమ్మెల్యే



బంగారుపాళ్యం తవణంపల్లి మార్చి 30 మనం న్యూస్. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో. చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు ఆదేశాల మేరకు. మన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ సోమవారం తవణంపల్లి మండలంలోని మద్యం గ్రామపంచాయతీలో అంగన్వాడి భవనాన్ని. సీసీ రోడ్డును. వారి చేతుల మీదుగా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజలు ముందుండాలని అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్య ఉన్న అధికారులు ముందుండి ఆ సమస్యను పరిష్కరించే విధంగా చూడడమే ప్రభుత్వ ఉద్యోగమని అన్నారు. తెలుగుదేశం పార్టీ గెలిచిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీని ప్రతి ఒకటి పూర్తిచేసిన ఘనత ఇప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కిందని అన్నారు. ప్రజలు ప్రతి ఒక్కటి తెలుసుకొని త్వరలో రానున్న సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తో పాటు మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర చౌదరి. బంగారుపాలెం మార్కెట్ చైర్మన్ భాస్కర్. గ్రామస్తులు పాల్గొన్నారు

## జలధార ప్రాజెక్టు అమలుపై రాష్ట్రస్థాయి ఇంజనీర్ల బృందం పరిశీలన

- జిల్లాలో జలసంరక్షణ చర్యలకు ప్రశంసలు – రాష్ట్రవ్యాప్త అమలుకు దారి



మదనపల్లి మార్చి 30: అన్నమయ్య జిల్లాలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మరియు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన “జలధార” ప్రాజెక్టు విజయవంతంగా అమలవుతూ మంచి ఫలితాలను అందిస్తున్న నేపథ్యంలో, ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలనే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.ఈ నేపథ్యంలో జిల్లాలో చేపట్టిన జల సంరక్షణ, జలవనరుల అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు క్యాచ్ మెంట్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (కడ) కమిషనర్ ఆధ్వర్యంలోని రాష్ట్రస్థాయి ఇంజనీర్ల బృందం ఈ రోజు జిల్లాలో విస్తృతంగా పర్యటించింది.జయవాడ నుంచి ఉదయం రోడ్డుమార్గంగా బయలుదేరిన ఇంజనీర్ల బృందం ముందుగా తిరుపతి చేరుకుని అక్కడి నుంచి రైల్వే కోడూరు, చిట్వేల్, పుల్లంపేట ప్రాంతాల్లో చేపట్టిన జలసంరక్షణ పనులను పరిశీలించింది. అనంతరం మధ్యాహ్న సమయంలో రాజంపేటకు చేరుకుని, అక్కడి నుంచి నందలూరు, రామాపురం మండలాల్లో కొనసాగుతున్న జలధార కార్యక్రమాలను పర్యటనలో భాగంగా, భూగర్భ జలాల పెంపు, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, కాలువల శుద్ధి, నీటి మళ్లింపు వంటి అంశాలపై అమలు చేస్తున్న పనులను ఇంజనీర్లు సమగ్రంగా పరిశీలించారు. ప్రతి ప్రాంతంలో స్థానిక అధికారులతో చర్చించి, పనుల నాణ్యత, ఫలితాలు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలపై వివరాలు సేకరించారు.ప్రత్యేకంగా, జలవనరుల సమర్థ వినియోగం, చెరువుల పునరుద్ధరణ ద్వారా వ్యవసాయానికి నీటి లభ్యత పెరగడం, భూగర్భ జలాల స్థాయి మెరుగుపడడం వంటి అంశాలను బృందం ప్రశంసించింది. జిల్లాలో అమలు చేస్తున్న జల సంరక్షణ చర్యలు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడింది.సాయంత్రం సమయంలో మదనపల్లెకు చేరుకున్న ఇంజనీర్ల బృందం, జిల్లాలో అమలు చేస్తున్న జలధార కార్యక్రమం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇది రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయదగిన ఉత్తమ నమూనాగా ఉందని పేర్కొన్నారు. కడ కమిషనర్ ఆధ్వర్యంలోని ఈ బృందం సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో “వందరోజుల ప్రత్యేక జలసంరక్షణ కార్యక్రమం”గా జలధార పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం విధివిధానాలు రూపొందించనుంది.జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ గారి సమర్థ నాయకత్వంలో జిల్లాలో చేపట్టిన జలవనరుల అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో జల సంరక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని సంకల్పించారు.ఈ పర్యటనతో జిల్లాలో చేపట్టిన జలధార ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో మరింత ప్రాధాన్యత లభించనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సామూహిక గృహ ప్రవేశాలు కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి)



తెలిపారు. అలాగే Beneficiary Led Construction పథకం కింద జిల్లాలో 16 వేల ఇళ్లను పూర్తి చేయడం జరిగిందని, ఇందులో సూళ్లూరుపేట నియోజకవర్గంలో 4,260 ఇళ్ళు నిర్మాణం పూర్తి చేశామని వీటిని కూడా ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈరోజు లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతోందని అన్నారు. ఇంతటి మంచి కార్యక్రమానికి పాల్గొంటున్నటువంటి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి తిరుపతి జిల్లా ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

**జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..**

మనిషి కలలకు ఇల్లు పునాది వంటిదని ఆ పునాది బలంగా ఉంటేనే భవిష్యత్తు బలంగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటకు రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుకు పాల్గొనడం జరిగిందన్నారు.

తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు మున్సిపాలిటీల్లో పదివేలకు పైగా TIDCO గృహాలను రూ. 735 కోట్ల నిర్మాణం వ్యయంతో చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. నేడు నాయుడుపేట నందు 2064 TIDCO గృహాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే Beneficiary Led Construction పథకం కింద జిల్లాలో 16 వేల ఇళ్లను పూర్తి చేయడం జరిగిందని ఇందులో సూళ్లూరుపేట నియోజకవర్గంలో 4260 ఇళ్ళు నిర్మాణం పూర్తి చేశామని వీటిని కూడా ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈరోజు లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతోందని అన్నారు. ఇంతటి మంచి కార్యక్రమానికి పాల్గొంటున్నటువంటి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి తిరుపతి జిల్లా ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. నాయుడుపేట ప్రాంతంలో టిడ్కో (TIDCO) గృహాల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింద న్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి, లబ్ధిదారులకు గృహాలను అందజేశారన్నారు. 2014-19 కాలంలో నిరుపేదల కోసం టిడ్కో గృహాల నిర్మాణం ప్రారంభమైందని, అయితే గత ప్రభుత్వం ఈ ఇళ్లను పూర్తి చేయక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వేగంగా చర్యలు తీసుకొని, 34 ఎకరాల విస్తీర్ణంలో 2060 టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.త ఇల్లు ప్రతి కుటుంబానికి, ముఖ్యంగా మహిళలకు ఒక భావోద్వేగ అంశమని, ముఖ్యమంత్రి కేవలం ఇళ్ల తలుపులే కాకుండా ప్రజల ఆశల తలుపులను కూడా తెరిచారని కొనియాడారు. అదేవిధంగా, ఉచిత ఇసుక విధానం వల్ల పేదలు సులభంగా ఇళ్ల నిర్మాణం చేపట్టగలుగుతున్నారని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి ఒక పెద్ద కొడుకులా బాధ్యత తీసుకుని రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇంకా, Tata Group సంస్థ దేశానికి ఎంత విశ్వసనీయతను సంపాదించుకుందో, అదే విధంగా ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఒక నమ్మకమైన నాయకుడిగా, బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచారని అన్నారు.*నాయుడుపేటలో నిర్వహించిన గృహాల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారుల స్పందన* .. ఆదిలక్ష్మి మహిళా లబ్ధిదారురాలు తన అనుభవాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.ఆమె మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా అద్దె ఇంట్లో నివసిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. 2018లోనే సొంత ఇల్లు మంజూరైనప్పటికీ, గత ప్రభుత్వ కాలంలో అది తమకు అందలేదని పేర్కొన్నారు. చాలా ఏళ్ల నిరీక్షణ తర్వాత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి N. Chandrababu Naidu గారి చేతుల మీదుగా తనకు సొంత ఇంటి కల నెరవేరడం పట్ల అపార ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలకు కృతజ్ఞతలు తెలుపుతూ, తమ కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుందని భావోద్వేగంతో తెలిపారు. ఈ గృహాల పంపిణీ కార్యక్రమం ద్వారా అనేక కుటుంబాలకు సొంత ఇంటి కల సాకారం అవుతుండడం గమనార్హం. ఈ కార్యక్రమంలో గృహ లబ్ధిదారులు షేక్ మస్థానీ, గండవరం రాజమ్మ, షేక్ దిల్షద్ , కడివేటి ఆదిలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, సులూరుపేట ఆర్డీవో దేవేంద్ర రెడ్డి, తాసిల్దార్లు జిల్లా అధికారులు పెద్ద ఎత్తున ప్రజలు. తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వ్యాపారాలకు కేంద్ర ప్రభుత్వం వెన్నుదన్ను

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేసిందనీ..,కేవలం 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే అత్యధికంగా 5,577 యూనిట్లకు రూ. 171.99 కోట్ల సబ్సిడీ లభించడం విశేషమన్నారాయన. రాష్ట్రంలోని అనంతపురం, చిత్తూరు, గుంటూరు మరియు ప్రకాశం జిల్లాలు ఈ నిధుల వినియోగంలో చురుగ్గా ఉన్నాయనీ..,శిక్షణలోనూ మహిళలదే పైచేయి అని చెప్పారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ శిక్షణా కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం ఆశాజనకంగా ఉందనీ..,గిరిజన ప్రాంతాల్లో నైపుణ్య శిక్షణలో భాగంగా ఏపీ నుంచి 5,976 మంది శిక్షణ పొందగా, అందులో 5,135 మంది మహిళలే కావడం గమనార్హమన్నారు. సంకల్ప్ పథకం కింద రాష్ట్రంలో శిక్షణ పొందిన 500 మందిలో 415 మంది మహిళా పారిశ్రామికవేత్తలే ఉన్నారనీ.., పి.ఎం. సూర్య ఘర్ సోలార్ ఎనర్జీ రంగంలో శిక్షణ పొందిన 1,349 మందిలో 220 మంది మహిళలు తమ నైపుణ్యాన్ని చాటుకున్నారనీ తెలియజేశారు.ఇతర పథకాల లబ్ధిదారులు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా రాష్ట్రంలో 1.07 లక్షల మంది స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు సాయం పొందగా, గ్రూపు రుణాల కింద 1.20 లక్షల మంది ప్రయోజనం పొందారన్నారు. స్టార్టప్ ఇండియా పథకం జనవరి 2026 నాటికి ఏపీ నుంచి 4,004 స్టార్టప్ లు గుర్తింపు పొందాయన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన స్టార్టప్ లలో దాదాపు 48 శాతం సంస్థల్లో మహిళలు డైరెక్టర్లుగా ఉన్నారని కేంద్రం తన నివేదికలో పేర్కొన్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు వివరించారు.